
మెయిన్‌లో

సిఎం నిర్ణయం యువతకు గొప్పవరం

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 13 ఏప్రిల్, 2024 | పేజీలు : 5

# రక్తమోడుతున్న రహదారులు

**11 రోజుల వ్యవధిలో 8 ప్రమాదాలు**

**19 మంది మృతి.. 18 మందికి గాయాలు**

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి :** అతి వేగం.. అజాగ్రతతో పాటు మద్యం, గంజాయి సేవించి వాహనాలు నడుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి రహదారులు రక్తమోడుతున్నాయి... వరుస ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు రహదారులు ఎక్కాలంటేనే వణికిపోతున్నారు. సూర్యాపేట జిల్లాలో ఏప్రిల్‌నెల ఆరంభం నుండి నేటి వరకు 11 రోజుల వ్యవధిలో 8 ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 19 మంది మృతి చెందగా 18 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. సూర్యాపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తమోడుతున్నాయి. దీంతో ప్రయాణికుల ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలుస్తున్నాయి. అతివేగం అజాగ్రతతో పాటు మద్యం, గంజాయి సేవించి వాహనాలు నడపడంతోనే ఈ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతుంది. దీనికి తోడు ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండడంతో డ్రైవింగ్‌లో అదుపు తప్పి ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. హైద్రాబాద్ నుండి విజయవాడ వరకు ఉన్న 65నెంబర్ జాతీయ రహదారిపైనే ఈ ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. వాహనాలు రహదారి ఎక్కితే చాలు వందకుపైగా స్పీడ్‌తో





రయ్యినా... వెళ్తున్నాయి. ఎదురుగా వాహనాలు వస్తే బ్రేక్ వేసే పరిస్థితి ఏమాత్రం లేదు. ఇది ఇలా ఉంటే ముందున్న వాహనాలను వెనుక నుండి అతి వేగంతో ఢీకొనడం ఇటీవల ఎక్కువైంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంజనపురి కాలనీ సమీపంలో 65వ జాతీయ రహదారిపై ఈనెల 4న జరిగిన ఆటో ప్రమాదంలో అక్కడిక్కడే ముగ్గురు మృతి చెందగా 14 మందికి గాయాలు అయ్యాయి. వీరిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు మృత్యవాతపడ్డారు. మిగత వారిలో ఎంత మంది బతికి బయట పడుతారో చెప్పలేము. ఆటో డ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ముందున్న లారీని ఓవర్‌టెక్ చేసే క్రమంలో వెనుక నుండి ఢీకొట్టడంతో ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇదిలా ఉంటే ఈనెల 9న సూర్యాపేట జనగాం రహదారిపై రాజానాయక్ తండ టోల్ ప్లాజా సమీపంలో మోటారు సైకిల్‌ను డిసిఎం వాహన ఢీకొట్టడంతో ఒకరు అక్కడిక్కడే మృతి చెందాడు. వీటిని మరవక ముందే రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం 65 నెంబర్ జాతీయ రహదారిపై సమీపంలో అతి వేగంగా వస్తున్న ఎర్టిగా కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడిక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు ఫ్లైఓవర్ పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సూర్యాపేట పట్టణానికి చెందిన నలుగురు యువకులు రంజాన్ సందర్భంగా విందుకు హాజరై తిరిగి కారులో వస్తుండగా అతి వేగంతో ముందున్న లారీని బలంగా ఢీకొట్టడంతో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందగా మరోకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. చివ్వేంల మండలం ఐలాపురం స్టేజీ( సూర్యాపేట దంతాలపల్లి రహదారిపై) సమీపంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్న వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ప్రాణాలు వదిలాడు. కోదాడ నియోజకవర్గ పరిధిలోని మునగాల మండలం ఆకుపాముల సమీపంలో ఉన్న 65నెంబర్ జాతీయ రహదారిపై గత పది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి చెందారు. ఓ శుభకార్యానికి హాజరైన వారు మోటారు సైకిల్‌పై తిరిగి వస్తూ ముందున్న ట్రాక్టర్ ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇదే మండల పరిధిలోని ముకుందాపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందారు. మునగాల మండలంలోని మరో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు పోగా మరో నలుగురికి గాయాలు అయ్యాయి. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వరుస ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు రహదారుపై ప్రయాణం చేయాలంటనే వణికిపోతున్నారు. మనం జాగ్రత్తగా వెళ్లిన ఎదుటి వారు ఏలా వస్తారో... అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ఈనెలలో అధికంగా పండుగలు, శుభకార్యాలు ఉండడంతో ప్రయాణాలు తప్పని పరిస్థితి. ప్రమాదాల భయంతో హాజరు కాకుండా ఇంటి వద్ద ఉంటే వారితో బంధుమిత్రులు ఏమనుకుంటారో.. మాట వస్తుందని మోహామాటానికి వెళ్లక తప్పడం లేదు.

## కానరాని ప్రత్యేక అధికారులు
## పడకేసిన ప్రత్యేక పాలన

**గ్రామాల్లో ఎక్కడికక్కడే సమస్యలు**
**పట్టించుకోని అధికారులు**

**ప్రజాపక్షం/నడిగూడెం :** గ్రామపంచాయతీల్లో పాలకవర్గాల గడువు ముగియడంతో గ్రామాల్లో ఏర్పాటైన ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. ఓ వైపు గ్రామాల్లో ఎక్కడికక్కడే సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రత్యేక అధికారులు మాత్రం పల్లెలకు చుట్టపుచూపు గానే వస్తున్నారు. పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడటం, నీటి సరఫరాను పట్టించుకోకపోవడం వంటి సమస్యలతో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదు. ఇష్టం వచ్చిన సమయానికి గ్రామపంచాయతీకి రావడం ఇష్టం వచ్చిన సమయానికి ఇంటికి వెళ్లడం. కనీసం 4 గంటలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండకుండా నిబంధనలు సైతం పాటించకుండా ప్రతినెల వేళల్లో జీతాలు పొందుతూ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి త్రీవమైంది.అసలే కరువు ఆపై ఎండలు ముదిరిపోవడంతో భూగర్భ జలాలు మరింత లోతుకు వెల్లాయి. దీంతో గ్రామ పంచాయతీల్లో బోర్లు ఎండిపోయాయి. మరోవైపు ఎప్పుడు వస్తాయో తెలియని మిషన్‌భగీరథ నీళ్ల కోసం ప్రజలు రోజుల తరబడి పడిగాడుపులు కాయాల్సి వస్తుంది.భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో వ్యవసాయ బోర్ల నుండి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో నీటిని కొరత లేకుండా చూడాలన్నారు.అంతేకాకుండా మండలంలోని కొన్ని గ్రామపంచాయతీల్లో కిందిస్థాయి సిబ్బందిని పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులకు గురిచేస్తూ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు. వీటంతటికి కారణం మండల అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడమే కారణమంటూ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని మండలంలోని పంచాయతీ కార్యదర్శులపై తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## వైన్స్ షాపుల్లో నిల్.. బెల్టు షాపుల్లో మద్యం ఫుల్...

**ప్రజాపక్షం/మోతె :** మండల వ్యాప్తంగా ఉన్న మూడు వైన్స్ షాపుల్లో వినియోగదారులకు కావాల్సిన బ్రాడ్ల మద్యం లభించడం లేదు. కాని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని బెల్టు షాపుల్లో మాత్రం కావాల్సిన బ్రాండ్లు అందుబాలో ఉంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న అక్రమ మద్యం అమ్మకాలు ఆగడం లేదు. అకరకొరగా తనిఖీలు కొనసాగుతున్న బెస్టు షాపుల నిర్వహకులు మద్యంను యదేశ్చగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో సిరికొండ, నామవరం, రావిపహడ్, బుర్కచర్ల, మామిళ్ళగూడెం గ్రామాల్లో సుమారు 15కుపైగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.వైన్స్ షాపుల్లో కావాల్సిన బ్రాండ్ల బీర్లు లభించడం లేదు కాగని బెల్టు షాపుల్లో మాత్రం అన్ని రకాల బ్రాండ్ల బీర్లు ఎన్ని కావాలన్న లభిస్తున్నాయి. సంబంధిత అధికారుల్లో కొందరు బెల్టు షాపుల నిర్వహకులకు దాడులకు ముందే సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఎక్సైజ్ అధికారులు దాడులు చేసిన సారాయి పెట్టే వారిని, బెల్టు షాపుల నిర్వహకులపై కేసులు నమోదు చేసిన సంఘటనలు లేవని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైన వైన్స్ షాపుల్లో లభించని బీర్ల బ్రాండ్లు, బెల్టు షాపుల్లో లభిస్తుండడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు షాపులను తనిఖీ చేసి, కేసులు నమోదు చేసి, అక్రమ విక్రయాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## మిల్లర్లలపై కఠిన చర్యలు తప్పవు

జిల్లా ఎస్‌పి చందన దీప్తి


మెయిన్‌లో

## మృతిచెందిన గోమాతకు అంత్యక్రియలు



ప్రజాపక్షం/గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో ప్రమాదవశాత్తు గోమాత శుక్రవారం మృతిచెందడంతో గ్రామస్తులందరూ కలిసి గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## వడదెబ్బపై అవగాహన



ప్రజాపక్షం/నడిగూడెం : అధిక ఉష్ణోగ్రతలు దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పల్లెదవాఖాన డాక్టర్ హరినాథ్ సూచించారు.శుక్రవారం మండల కేంద్రంలో వడదెబ్బపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ హరినాథ్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, ప్రజలు పండ్ల రసాలు,మంచినీరు ,ఓఆర్ఎస్ వంటి వాటిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ విజయ్‌కుమార్, రాధ,మహేశ్వరీ, కృష్ణమూర్తి, ఆశా కార్యకర్త లక్ష్మీ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జహంగీర్‌ను గెలిపిద్దాం



ప్రజాపక్షం/ఆలేరు : భువనగిరి పార్లమెంటు సిపిఎం పార్టీ అభ్యర్థి ఎండి.జహంగీర్ సుత్తె కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ ఆలేరు మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ కోరారు. శుక్రవారం ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలో సిపిఎం ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సంఘీరాజు బోడ హనుమంతు, చిట్యాల సుధాకర్, ఎల్లయ్య, వెంకటేష్, లక్ష్మి , శంకరమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీపార్వతీ సమేత శ్రీ పంచముఖ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యము, గోపూజ, అఖండ దీపారాధన, దీక్షాధరణ, మండపారాధన కార్యక్రమాలను ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చక సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

## నారపరెడ్డి మృతి.. కాంగ్రెస్‌కి తీరనిలోటు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుజ్జుల నారపరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు,ఐఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్‌లు అన్నారు.మండలంలోని వేపలసింగారం గ్రామానికి చెందిన గుజ్జుల నారపరెడ్డి శుక్రవారం మృతి చెందారు. నారపరెడ్డి మృతదేహాన్ని వారు సందర్శించి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నారపరెడ్డి ఎనలేని సేవలందించారని కొనియాడారు.నివాళులర్పించిన వారిలో ఎంపిపి గూడెపు శ్రీనివాస్,అడిషనల్ ఎస్పీ సుంకి సురేందర్‌రెడ్డి,టిటిడి బోర్డు మెంబర్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ధర్మారి వెంకటేశ్వర్లు, రాము, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులు పెట్టవద్దు : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏలాంటి ఇబ్బందులు పెట్టవద్దని జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోళ్ళపై రైతులు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే రైస్ మిల్లుల యజమానులు తూకాల్లో మోసాలు చేయకుండా చూడాలన్నారు. కమీషన్ ఏజెంట్లు రైతుల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుల ధాన్యాన్ని దళారులు దోచుకుంటే ఉపేక్షించేది లేదన్నారు.

# 323 కేంద్రాలలో ధాన్యం కొనుగోలు



ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ : జిల్లాలో 323 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టినట్లు జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్ నేడొక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ళను వివరిస్తూ 85 ఐకెపి కేంద్రాలు, 225 పాక్స్ కేంద్రాలు, 13 ఎఫ్‌పిఓల ద్వారా కొనుగోళ్ల చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 32 కేంద్రాల ద్వారా 168 మంది రైతుల నుండి 29 కోట్ల విలువ చేసే 1330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని సంచులు, టార్పాలిన్లు ఉన్నాయని, రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని ఈ సందర్భంగా కోరారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో రవాణా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు, కొనుగోలు అనంతరం రైతుల ఖాతాలలో సకాలంలో డబ్బులు జమ చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : అవంతిపురం నుండి ఇమాంపేట వాటర్ ప్లాంట్‌కు వచ్చే మిషన్ భగీరథ వాటర్ పంపింగ్ ప్రధాన పైపులైన్‌కు లీకేజి కారణంగా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుందని, జిల్లా ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు, రేపు పైపులీకేజి మరమ్మత్తు పనులు చేయగా సోమవారం తిరికి నీటి సరఫరాను పునరుద్దరణ చేయనున్నట్లు తెలిపారు. దీంతో సూర్యాపేట, కోదాడ మున్సిపాలిటిలతో పాటు చిలుకూరు, అనంతగిరి, కోదాడ, మునగాల, నడిగూడెం, పెన్‌పహడ్, సూర్యాపేట పరిధిలోని 15 గ్రామాలకు నీటి సరఫరాలో నీటి అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. కోదాడలో తాగునీటి ఇబ్బందులు ఉంటే కోదాడ టెక్నికల్ అధికారి రాజారెడ్డి 835554641, సూర్యాపేట కంట్రోల్ రూం 8374498499ను సంప్రదించాలన్నారు.

# అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/మోతె : మండల పరిధిలోని తుమ్మలపల్లి ఆదర్శ పాఠశాలతో పాటు మామిళ్ళగూడెంలోని మహిళ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మౌళిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో తహసిల్దార్ సంఘమిత్ర, ఎఇ అరుణ, ఎపిఎం వెంకయ్య, ఎంఇఒ గోపాలరావు, ఇన్‌చార్జి ఎంపిడిఓ హరిసింగ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి...



ప్రజాపక్షం/దేవరకొండ ; నేడు దేవరకొండ పట్టణంలోని డా. బిఆర్ అంబేద్కర్ గ్రంథాలయంలో జ్యోతిబాపూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించుటకు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహనీయుల ఉత్సవాలపై సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని దేవరకొండ నియోజకవర్గ స్థాయిలో పూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14న పట్టణంలో ఉదయం 9 గంటలకు, కొండమల్లేపల్లిలో ఉదయం 11 గంటలకు పూలే, అంబేద్కర్ జయంతిల ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ఓసి, బిసి, ఎస్సి, ఎస్టీ, మైనార్టీ, ఉద్యోగ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు మరియు అన్ని గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో బహుజన వాది డా. ఏకుల రాజారావు, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రివెంకన్న, నల్గొండ జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు బిక్షపతి, ఉపాధ్యక్షులు సురేష్, గోపాల్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా శ్రీనివాస్‌గౌడ్, భాస్కరాచారి, చంద్రమౌళి, ఆంజనేయులు, వెంకటేష్, కూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాద బిజెపిని ఓడించాలి



ప్రజాపక్షం/ఆలేరు : పార్లమెంట్ ఎన్నికలలో మతోన్మాదా బిజెపిని ఓడించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆలేరు మండలంలోని పార్టీ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి సమావేశం కిష్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వెంకటేష్ హాజరై మాట్లాడుతూ అర్హులైన పేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు కట్టించి పేదలను ఆదుకోవాలని అన్నారు. దళితుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కొల్లూరు గ్రామంలో ఈ నెల 13వ తేదీన పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, జానమ్మ, సరళ, నీలమ్మ, ప్రవీణ్, లక్ష్మి , శీను, జహంగీర్, శీను తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతికి ఎంఎల్‌ఎకు ఆహ్వానం



ప్రజాపక్షం/నందికొండ : ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతిని నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక హిల్ కాలనీ లో ఈ నెల 14న నిర్వహించనున్నట్లు శుక్రవారం అంబేద్కర్ సంఘం మాల మహానాడు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డిని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఈనెల 14న జరగబోయే అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుంటి కోటేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శి జగదం బాలాజీ రావు, అధ్యక్షులు పయర్ల బాబురావు, ఉపాధ్యక్షులు బత్తుల ప్రకాష్ , కార్యదర్శి రవీంద్ర భూపతి, యాళ్ల విజయ్ ఆనంద్,గౌరవ సలహాదారుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన క్రాంతి నాయక్



ప్రజాపక్షం/ఆలేరు : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డిని ఆలేరు ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కేతావత్ క్రాంతి నాయక్ శుక్రవారం వారి నివాసంలో మర్యాదపూర్వ కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రాజస్థానీ దుర్మరణం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** రాజస్థాన్ కు చెందిన మహమ్మద్ సాజిద్ బొలెరో వాహనంలో చెన్నై నుండి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో నార్కట్‌పల్లి గ్రామ శివారులోని ఎన్ హెచ్ 65 రోడ్డు పక్కన గల దుర్గ హోటల్ వద్ద బొలెరో వాహనం ఆపి వాష్ రూమ్ కొరకు రోడ్డు దాటుతుండగా హైదరాబాదు నుండి విజయవాడ వైపు వెళుతున్న టిఎస్08జిఏ1057 నంబరు గల కారు డ్రైవర్ తన కారును అతివేగంగా జాగ్రత్తగా నడుపుతూ రోడ్డు దాటుతున్న సాజిద్ కు టక్కరివగా బలమైన రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తనతోపాటు పనిచేయుచున్న తన గ్రామానికి చెందిన హేమ్ సింగ్ ఫిర్యాదు మేరకు నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 14న మార్నింగ్ వాక్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబెడ్కర్ 143వ జయంతి,విప్లవ విద్యార్థి నాయకుడు పిడిఎస్‌యు వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి 52వ వర్ధంతి సందర్భంగా వారి ఆశయాల సాధనకై ఏప్రిల్ 14 న ఉదయం 6 గంటలకు ఎన్. జి కాలేజ్ నుండి గడియారం సెంటర్ వరకు మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పిడి ఎస్ యూ జిల్లా పూర్వ అధ్యక్షుడు పన్నాల గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ వాక్ లో అంబెడ్కర్, జార్జిరెడ్డి అభిమానులు, సంఘం పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నేడు బిఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయడం కోసం శనివారం నకిరేకల్ పట్టణంలోని సువర్ణ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు,గుంటకండ్ల జగదీష్ రెడ్డి, బిఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్‌లు పాల్గొంటారని తెలిపారు. పార్టీలో వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

## తాగునీటి సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపాలిటి తాగునీరు అందించే మిషన్ భగీరథ పైపు లైన్ల మరమ్మత్తుతో నీటి సరఫరాలో ఈనెల 14, 15 తేదీల్లో అంతరాయం కలనగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గరిదేపల్లి సమీపంలో పైపులను మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోని సహకరించాలని కోరారు.

# బిఆర్ఎస్‌ని వీడిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు



**ప్రజాపక్షం/శాలిగౌరారం :** రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ఏ పార్టీ ఢీకొనలేదని, ప్రధాని మోదీని ఈ ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నల్లగొండ జిల్లా, శాలిగౌరారం ఎంపిటిసి జోగు సైదమ్మ శ్రీనివాస్ తో పాటు తాజా మాజీ సర్పంచులు జటంగి శంకర్, గౌర వీరయ్య, బండారు శంకర్, షేక్ ఖాషీంబి, శ్రీరామదాస్ రాజు, షేక్ జహంగీర్,నూక కిషోర్, జమ్ము అశోక్ తో పాటు మరో వంద మంది వివిధ గ్రామాల నుంచి ఎమ్మెల్యే మందుల సామెల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుక వెళ్లేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేటజిల్లా పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అన్నేబోయిన సుధాకర్, మండల పార్టీ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి, చాడ సురేష్ రెడ్డి ,చామల మహేందర్ రెడ్డి, నోముల జనార్ధన్, బెల్లి వీరభద్రం,గూని వెంకటయ్య , వేముల గోపినాథ్ , జయరాజ్ తదితరులు ఉన్నారు.

# జ్యోతిబాపూలే 197వ జయంతి ఉత్సవాలు



**ప్రజాపక్షం/నాంపల్లి ;** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతి ఉత్సవాలను ప్రజా సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు నాంపల్లి చంద్రమౌళి, దళిత సంఘం జిల్లా నాయకులు ఇరిగి వినోద్‌లు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం, దళిత, గిరిజన జాతిసంక్షేమం కోసం స్త్రీ, పురుష సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన యోధుడు కులవివక్ష మీద అలుపెరుగని పోరాటం చేసిన సంఘ సంస్కర్త అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళా సాధికారతకు పాటుపడిన ధీరుడు జ్యోతిబాపూలే అని ఆయన ఆశయ మార్గంలో ముందుకు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, దళిత సంఘం నాయకులు గాదెపాక రమేష్, దళిత హక్కుల పోరాట సమితి కన్వీనర్ ఊరుపక్క వెంకటయ్య, పూల చిన్న వెంకటయ్య, డోల్‌దెబ్బ మండల నాయకులు మన్నాల మల్లయ్య, సత్తయ్య, రాములు, యాదయ్య, నర్సింహా, వెంకటయ్య, వంశీ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# 14న భీమ్ యాత్రను విజయవంతం చేద్దాం



**ప్రజాపక్షం/భువనగిరి-రిరూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో ఈ నెల 14న నిర్వహించబోయే భీమ్ యాత్రను విజయవంతం చెయ్యాలని భువనగిరి పట్టణ హౌసింగ్ బోర్డ్, బహార్ పెట్, సింగన్నగూడెం కాలనీలలో మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పొత్నక్ ప్రమోద్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అంబేద్కర్ జీవిత చరిత్ర తెలుసుకోవాలని, ప్రతి ఒక్కరి ఇంట్లో భారత రాజ్యాంగం పుస్తకం ఉండాలని, చదవాలన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే దిశగా మనమంతా పోరాటం చేయాల్సి అవసరం ఉందని అన్నారు. అలాగే ఏప్రిల్ 5 నుండి 14వ తేదీ వరకు అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే మహనీయుల జయంతి కార్యక్రమలను విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 14న జరుగుతున్న భీమ్ యాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని మన శక్తి ప్రదర్శన చెయ్యాలని అన్నారు. ఎసి,ఎస్సి,బిసి, మైనార్టీ ల ఐక్యత వర్ధిల్లాలి అన్నారు. ఈ కార్యక్రమంలో దొనకొండ రములు, ఈరపాక నరసింహ, ఎండి.ఇమ్రాన్, సిరిపంగ శివలింగం, ఇటుకల దేవేందర్, నిలుగొండ శివశంకర్, బర్రె ప్రమీల, బుగ్గ జయ, కర్తల శ్రీనివాస్, బాణోత్ భాస్కర్ నాయక్, బాసాని మహేందర్, చింతల శివ, కోళ్ల కృష్ణ, నరసింహ, సంపత్, సందీప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక, కర్షక పక్షపాతిని గెలిపించండి

**ప్రజాపక్షం/వలిగొండ :** కార్మికుల కోసం రైతుల కోసం వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే పేదల అభ్యర్థి ఎండి జహంగీర్ ను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు లు పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున మండల పరిధిలోని పులిగిల్ల, పైల్వాన్ పురం గ్రామాల్లో సిపిఎం ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల కార్మికుల కూలీల పక్షాన పోరాడే సిపిఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మద్దతు ధర అందించలేకపోయారని మరొకవైపు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించి రైతులను కూలీలుగా కార్మికులుగా మార్చారన్నారు అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ వాళ్లకు అప్పజెప్పి కార్మికులకు వారి సమస్యలపై పోరాడే హక్కును తొలగించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, పులిగిల్ల సిపిఎం నాయకులు దొడ్డి బిక్షపతి, వడ్డమాని వెంకటయ్య, వేముల అమరేందర్ బొడ్డు రాములు, వేముల ముత్తయ్య, దొడ్డి యాదగిరి, వేముల నాగరాజు, వడ్డెమాని మధు, మంద విజయ్, వేముల జ్యోతిబస్, బుగ్గ ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ఆలేరు :** నేడు ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ప్రకాష్ గార్డెన్లో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని ఆలేరు మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలేరు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ నేడు జరగబోయే సన్నాహ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమానికి మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, భువనగిరి టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మల్లేష్, మాజీ శాసనసభ్యులు బిక్షమయ్య గౌడ్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, మండల పార్టీ కార్యదర్శి రచ్చ రామనర్సయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ రవీందర్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, మాజీ జిల్లా ఆర్డీఏ నెంబర్ కృష్ణ, వెంకటేష్, రామకృష్ణ, సంపత్, నర్సింహులు, సాగర్, భరత్, శ్రావణ్, వెంకటేష్, ఉప్పలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కేశవ్‌ను పరామర్శాంచిన ఆర్‌డిఆర్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు రాపర్తి కేశవ్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆరోగ్య విషయాలను తెలుసుకోని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్ గౌడ్, బైరు శైలేందర్, కక్కిరేణి శ్రీనివాస్, ఎలిమినేటి అభినయ్, అన్నపర్తి రాజేష్, కొండపల్లి దిలీప్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, కుంభం రాజేందర్, ఆలేటి మాణిక్యం, రాపర్తి సైదులు, రాపర్తి పెద్ద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## సత్తయ్యను పరామర్శించిన చెక్క వెంకటేశ్

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణ కేంద్రంలో సిపిఐ సీనియర్ నాయకులు ఐలి సత్తయ్య అనారోగ్యంగా ఉండడంతో శుక్రవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, జానమ్మ, సరళ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎన్నికల ప్రచార రథాలు ప్రారంభం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు బిజెపికి పట్టం కట్టి కుటుంబ రాజకీయాలను బొందపెట్టాలని నల్లగొండ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డిలు అన్నారు. బిజెపి జిల్లా కార్యాలయం వద్ద ప్రచార రథాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి గెలిచినా వెంటనే యువతకు 50 వేల ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీదేవి రెడ్డి,పిల్లి రామరాజు, పోతేపాక లింగస్వామి, రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య, ఫకీరు మోహన్ రెడ్డి, గాయం భూపాల్ రెడ్డి, దాసోజు యాదగిరా చారి, గడ్డం మహేష్, నీరజ, జిల్లా కనకయ్య, కిరణ్, కార్యదర్శి శాంతి స్వరూప్, పులకర బిక్షం, తిప్పర్తి పల్లె ప్రకాష్, బోగరి అనిల్ కుమార్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మధుసూదన్ గౌడ్ మరణం బాధాకరం...



**ప్రజాపక్షం/గుండాల ;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన యువ నాయకుడు గూడ మధుసుధన్ గౌడ్ మృతి బాధాకరం అని ఆలేరు ఎంఎల్‌ఎ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎంఎల్‌ఎ గొంగిడి సునితలు అన్నారు. శుక్రవారం ఆయన పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాడ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో అండెం సంజీవరెడ్డి, యాదగిరిగౌడ్ నాయకులు తదితరులు ఉన్నారు.

## సోమాచారి మృతి పట్ల సంతాపం



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** విద్యుత్ లైన్‌మెన్ సోమాచారి మృతి బాధాకరమని విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్ అన్నారు. సోమాచారి శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉద్యోగులు ఆయన మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమాచారి అంకితభావంతో ఉద్యోగ భాధ్యతలను నిర్వహించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ముఖ్యంగా కార్మిక నాయకుడిగా ఉంటూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. సోమాచారి కుటుంబసభ్యులు ఆయన కండ్లను మిర్యాలగూడ నేత్రనిధికి దానం చేసి దాతృత్వం చాటుకున్నారన్నారు. సంతాపం తెలిపిన వారిలో సబ్ డివిజ్ ఏడీలు కోడిరెక్క రవికుమార్, రవీందర్‌రెడ్డి, ఏఈలు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, బాలు, అమర్‌సింగ్, తోట వెంకటేశ్వర్లు, రామచందర్, సీతారాములు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## అవకాశవాదులను ఓడించండి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** భువనగిరి పార్లమెంటు సిపిఎం ఎండీ జాహంగీర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మోత్కూరు మండలం ముశిపట్ల సీపీఎం గ్రామ శాఖ సమావేశం శుక్రవారం పాటి శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ నియోజకవర్గం నుండి వివిధ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులుగా గెలుపొందారు కానీ, వారి స్వార్థ ప్రయోజనాలకు రాజకీయాలను అడ్డు పెట్టుకుంటున్నారు. వారికి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. నియోజకవర్గంపై పూర్తి అవగాహన కలిగిన ప్రజా నాయకునిగా సీపీఎం పార్టీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నాడని, ప్రజలు ఆదరించి, సుత్తె కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి, అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పైళ్ల రామ్ రెడ్డి, సభిత, పాటి శ్రీనివాస రెడ్డి, సరిత, దడిపల్లి ప్రభాకర్, కొంపల్లి గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాశపాక దయాకర్, ఏర్రోల్ల లింగస్వామిలు అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలం కేంద్రంలో సిపిఐ పార్టీ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి సమావేశం మీసాల దాసు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ దళితులపై విపక్ష చూపుతుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చుకోవచ్చని విర్రవీగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అంబేద్కర్ అభయ హస్తం రూ.12 లక్షలు, భూములేని నిరుపేదలకు మూడెకరాల భూమి, ఇల్లులేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇంటి స్థలాలు కేటాయించి ఇల్లు కట్టి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, సహకార దర్శి పేరబోయిన మహేందర్, ఏఐటిసి జిల్లా అధ్యక్షుడు గోరంటి రాములు పాల్గొన్నారు. అనంతరం డిహెచ్‌పిఎస్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల కన్వీనర్లుగా మీసాల దాసు, బోద సాయిలు, కొకన్వీనర్ మద్దూరు భాగ్యమ్మ, ఎన్.కిష్టమ్మలను ఎన్నుకున్నారు.

## కులవృత్తులను కార్పొరేట్ శక్తులుగా మార్చుతాం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గంలోని అన్ని కుల వృత్తుల కోఆపరేటివ్ సెక్టార్లను బలోపేతం చేసి కార్పోరేట్ శక్తులుగా మార్చడమే నా ధ్యేయమని బిజెపి ఎంపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం చేనేత భరోసా యాత్ర పేరుతో పోచంపల్లి పట్టణంలో పర్యటించారు. స్థానిక మార్కండేశ్వర స్వామి దేవాలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలి మహాజన సంఘం ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యి చేనేత పరిశ్రమ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న వివిధ పథకాలను, చేనేత పరిశ్రమ సంక్షేమ అభివృద్ధి కోసం కావలసినవి అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నేత కార్మికులకు వచ్చే పథకాలను నేరుగా లబ్ధిదారునికి చెందే విధంగా విధానపరమైన నిర్ణయాలను తీసుకునేందుకు మార్గాలను చేపట్టాలని సంఘం నాయకులు ఆయన ముందు ఉంచారు. ఈ సందర్భంగా టైం అండ్ డై అసోసియేషన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంటరీ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ చేనేత కార్మికులు ప్రజలు అందరూ సంపూర్ణంగా మద్దతు తెలిపి అత్యధిక మెజారిటీతో నిబద్ధత కమిట్మెంట్ ఉన్న తనను మళ్లీ ఎంపీగా గెలిపిస్తే ప్రభుత్వం తరఫున పూర్తి అండదండలతో పాటు సమగ్రమైన అభివృద్ధి చేసి నిరూపిస్తానని హామీ ఇచ్చారు. ప్యారిస్ ఫ్యాషన్ షో లో చేనేత ఉత్పత్తులు వాడడం ఈ దేశానికే గర్వకారణమని. కాగా కార్మికులు తమ సమస్యల పట్ల వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ చేనేత సెల్ జిల్లా కన్వీనర్ గంజి లింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి,రాష్ట్ర నాయకులు కర్నాటి ధనంజయ, పట్టణ అధ్యక్షులు డబ్బికార్ సాహెష్, మండల అధ్యక్షుడు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి బైరు వెంకటేష్, ఏలే శ్రీనివాస్, యువమోర్చా అధ్యక్షుడు శ్రీకాంత్, తండ రమేష్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కండ్ల ముందే నీళ్లు పోతున్నా ఇవ్వలేని కాంగ్రెస్ వాళ్లు



**ప్రజాపక్షం/కోదాడ :** కండ్ల ముందే నీళ్లు పోతున్నా ఇవ్వలేని రండలు కాంగ్రెస్ వాళ్లని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను ఎద్దేవా చేశారు.శుక్రవారం పట్టణంలో నల్లగొండ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డితో కలసి ఎన్నికల సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడారు.చంద్రబాబు,వైయస్సార్ హయాంలో జడదోపిడి జరుగుతున్న నోరు మూసుకున్న రండు కాంగ్రెస్ వాళ్లన్నారు.ఆరోగ్యం బాగోలేకున్నా రైతుల కోసం తిరుగుతున్న పోరాటయోధుడు కేసీఆర్ అని కితా బిచ్చారు. మేము అధికారంలో ఉండగా ఎవరి కోసం ఏ స్కీం పెడదాం అని ఆలోచించాం కానీ కాంగ్రెస్ వాళ్లు పొద్దున లేస్తే అన్నీ దొంగ మాటలే అన్నారు. రేవంత్ లాగానే ఉత్తమ్ కూడా ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకు తున్నారన్నారు.కాంగ్రెస్ 60 ఏళ్ల దుర్మార్గం పాలన చేస్తే ఫ్లోరోసిస్ అవతరించిందని కేసీఆర్ సిఎం అయని నల్లగొండలో ఫ్లోర్లైడ్‌ను పారదోలారన్నారు.ఆనాడు నల్లగొండలో 3 నుండి 4లక్షల ధాన్యం పండగా నేడు 40 లక్షల ధాన్యం పండించిన దేశానికి నల్లగొండ ధాన్యాగారం అయిందని అది బిఆర్ఎస్ ప్రభుత్వం కృషే అన్నారు.ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అబద్దపు పాలన చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హామీలు అడిగితే కేసీఆర్‌ను బొందపెట్టాలని,రుణ మాఫీ అడిగితే బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు.కేసీఆర్ ఎప్పుడైనా చేయగలిగిందే చెప్పాడని చెప్పిందే అమలు చేసి చూపించాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అక్రమ కేసులు పెడుతున్నారని పోలీసులను అడ్డం పెట్టుకుని పాలనచేసే రండలని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో ప్రజలకు ఏ అవసరం అయినా పథకాలు ఇచ్చే ప్రయత్నం జరిగిందన్నారు.బిఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మోసపు మాటలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీళ్ల ముచ్చట అర్ధం కావట్లేదని ఉత్తమ్ పెద్ద అసమర్ధుడన్నారు.కాంగ్రెస్ హయాంలో ప్రజల కష్టాలు మరింత పెరిగాయని వీటినే ప్రజల్లోకి విస్తృతంగా తీసుకవెళ్లాలన్నారు.గుజరాత్ మోడల్ పాలన అంటే దుర్మార్గలే అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్,కంచర్ల భూపాల్‌రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిషన్‌భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/కోదాడ :** మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేయు గ్రీడ్ మెయిన్ పైపులైన్ గరిడేపల్లి వద్ద మరమ్మత్తులకు గురైనందున ఈ నెల 13 నుండి 15 వరకు మూడురోజులు నియోజకవర్గ వ్యాప్తంగా నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మిషన్ భగీరథ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని నీళ్ల ఇబ్బంది ఉన్నవారికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

## ఎన్నికల సమావేశంలో పాల్గొనాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి ;** నేడు దేవరకొండ పట్టణంలో మధ్యాహ్నం సాయిశివ గార్డెన్‌లో నిర్వహించు దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ఎన్నికల సమావేశంలో కొండమల్లేపల్లి మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, అనుబంద సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అందరు పాల్గొనాలని ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల సమావేశానికి మంత్రులు నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సిఎల్పి నేత కుందూరు జానారెడ్డి, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్, నల్గొండ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి తదితర నాయకులు హాజరవుతారని, మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని అన్నారు.

## వస్త్ర దుకాణం ప్రారంభించిన ఎంఎల్‌ఎ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి ;** మండల కేంద్రంలోని విష్ణు కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మగువల వస్త్ర ప్రపంచం దుకాణంను గురువారం దేవరకొండ ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ మండల కేంద్రం వ్యాపార పరంగా అభివృద్ధి చెందడం అభినందనీయం అని అన్నారు. యువత స్వయంగా వ్యాపారాలు చేస్తూ పది మందికి ఉపాధి కల్పించడం ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ మునిసిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్, పిసిసి సభ్యులు డా. వేణుధర్‌రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎంఏ. సిరాజ్‌ఖాన్, చిత్రియాల పిఏసిఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, నేరేడుగొమ్ము ఎంపిపి బిక్కునాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్‌రెడ్డి జడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎంఎల్‌ఎ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి ;** మండల కేంద్రం చౌరస్తాలో మున్నురుకాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కోట్ల జగదీష్‌పటేల్, ఎయిర్‌టెల్ నరందాస్ పవన్‌లు ఏర్పాటు చేసిన చలివేంద్రంను గురువారం ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో మండల కేంద్రానికి వచ్చిపోయే ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని జగదీష్, పవన్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, పిసిసి సభ్యులు డా. వేణుధర్‌రెడ్డి, జాల నర్సింహారెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్, నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎంఏ సిరాజ్‌ఖాన్, నేరేడుగొమ్ము ఎంపిపి బిక్కునాయక్, జడ్పిటీసి సలహాదారు పసునూరి యుగేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందండి



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాన్యమైన వడ్లు తెచ్చి మద్దతు ధరను పొందాలని యాదగిరిగుట్ట ఎడిఎ పద్మావతి రైతులకు పిలుపునిచ్చారు. ఆమే గురువారం మోటకొండూరు మండలంలోని చందేపల్లిలో ఏఓ సుజాతతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్మ వద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధరను పొందాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా సాఫీగా కొనుగోలు ప్రక్రియ జరిగే విదంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివాని, ఎప్‌పిఓ సెంటర్ ఇంచార్జి నర్సింహా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలలో 1.30 లక్షలు నగదు పట్టివేత



**ప్రజాపక్షం/చండూరు :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా చండూరు ఎస్ఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న వాహనాల తనికీల్లో శుక్రవారం చండూరులోని అంగడిపేట పెట్రోల్ బంక్ వద్ద వీరమల్ల సాయి కుమార్ వద్ద 60వేలు, ఆడెపు మహేష్ 70వేలు రూపాయల నగదు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్లుతున్నందున అట్టి డబ్బులను సీజ్ చేసి తదుపరి విచారణ గురించి జిల్లా ట్రెజరికి అప్పగించడం జరిగిందని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు.

## గంగాధర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర సమరయోధుడు తిరునగరు గంగాధర్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి నివాళులర్పించి మాట్లాడారు. గంగాధర్ కాంగ్రెస్ పార్టీకి అండదండగా ఉండి నమ్మిన కార్యకర్తకు అండగా ఉన్న నాయకుడు గంగాధర్ అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు, నాయకులు పొదిలి వెంకన్న, చల్లా వెంకన్న, బంటు లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు.

## బిజెపిలో చేరిన కాసాల

**ప్రజాపక్షం/చండూరు :** ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు కాసాల వెంకట్‌రెడ్డి శుక్రవారం భువనగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా కాసాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడుగా పని చేశానని గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని భువనగిరి బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.

# ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి హాజీపురం, గ్రామాలకు చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామిడి రాంరెడ్డి, శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు కూకుట్ల ఈశ్వర్ యాదవ్‌ల ఆధ్వర్యంలో సుమారు 200 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు వారి పార్టీలకు రాజీనామా చేసి యాదగిరిగుట్ట బీర్ల ఐలయ్య నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు తగిన గుర్తింపు దక్కుతుందని కొత్త పాత అనే తేడా లేకుండా కార్యకర్తలంతా సైనికుల పనిచేసి భువనగిరి ఎంపీ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో 75 వేల ఒట్ల మెజార్టీని తీసుకువచ్చి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించుకొని కాంగ్రెస్ పార్టీ బలాన్ని నిరూపించాల్సిన అవసరం ప్రతి ఒక్క కార్యకర్త పైన ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు చీర్ల రాజేశ్వర్ యాదవ్, మాజీ సర్పంచులు, రాంపల్లి మహేష్ గౌడ్, కవిత వెంకటేష్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు పైలెట్ రాజేష్, నాయకులు,మర్రి భగవంతు రెడ్డి, బేతాళ శ్రీనివాసులు, మహేష్ యాదవ్, ఉపేందర్ యాదవ్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప ప్రజ్ఞాశీలి సుదర్శన్ : ఎంఎల్ఎ




**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** దాసి సుదర్శన్ ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ గొప్ప చిత్రకారుడిగా, నటుడిగా అత్యంత ప్రజ్ఞాశీలిగా పేరుగాంచడం కొంతమందికే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవీభవన్‌లో సమూహ రైటర్స్ ఫోరం నాయకులు కస్తూరి ప్రభాకర్ అధక్షతన జరిగిన దాసి సుదర్శన్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు ఒకే వ్యక్తి జర్నలిస్టుగా, ఉపాధ్యాయుడిగా, చిత్రకారుడిగా, నటుడిగా రాణించడం, దాసి సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా జాతీయ స్థాయి నంది అవార్డు రావడం మిర్యాలగూడకు గర్వకారణమన్నారు. దాసి సుదర్శన్ సహచిరణి స్వతంత్రకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అదే విధంగా దాసి, కొమురం భీమ్ ఫేమ్ నటుడు భూపాల్ మాట్లాడుతూ దాసి సుదర్శన్‌కు ఆ రోజుల్లోనే జాతీయ స్థాయి అవార్డు రావడం మనందరికి గర్వకారణమన్నారు. జేవీవీ నాయకులు డాక్టర్ ముర్వా రామారావు మాట్లాడుతూ సమాజం కోసం పరితపించే వ్యక్తులు కొద్దిమందే ఉంటారని వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో విరాటపర్వం దర్శకులు వేణు, మట్టిమనిషి పాండురంగారావు, ఆయా ప్రజా సంఘాల నాయకులు సోమయ్య, రామయ్య, గణేష్, కిరణ్మయి, భిక్షమయ్య, కందుకూరి సుదర్శన్, అల్లం కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్ రెడ్డి, శంకర్, విజయ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి



**ప్రజాపక్షం/చండూరు :** నరేంద్ర మోడీ నాయకత్వంలో ముచ్చచగా మూడవసారి కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని భువనగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన చండూరు మున్సిపాలిటీలో చేనేత కార్మికుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్‌లో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే భువనగిరిలో బిజెపిని గెలిపించాలని చేనేత కార్మికులను కోరారు. చేనేత కార్మికులు పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని అందులో ముఖ్యమైన ప్రింటెడ్ డిజైన్లను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంన్నందున భువనగిరిలో బూర నర్సయ్యను గెలించాలని కోరారు. 2018లో నేను భువనగిరి ఎంపిగా అనేక అభివృద్ధి పథకాలను ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో బిబినగర్‌లో ఎయిమ్స్ , కేంద్రీయ విశ్వవిద్యాలయం , పాస్‌పోర్ట్ కార్యాలయం, 524కిలో మీటర్ల జాతీయ రహదారుల విస్తరణ,ఎంఎంటిఎస్, దుండు మల్కాపురంలో ఇండస్ట్రీయల్ పార్క్ వంటి పనులను తీసుకొచ్చానని అన్నారు. రాజకీయాలలోకి వచ్చిన తర్వాత తన సంపద తగ్గిందే కాని పెరగలేదని అన్నారు. అనునిత్యం పేదల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతానని అన్నారు. ఏనాడు అవినీతి అక్రమాలకు పాల్పడలేదని ఎవ్వరికి బూర నర్సయ్యగౌడ్ తలవంచడూ అని అన్నారు. దేశం, ధర్మం, అభివృద్ధి లక్ష్యంతో ముందుకు పోతున్న ప్రధాని నరేంద్రమోడీ మూడవ సారి అధికారంలోకి రావాలంటే భువనగిరిలో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బూర నర్సయ్య గౌడ్‌ను గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో ఓబిసి మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, బిజెపి మునుగోడు కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల వెంకన్న, సోమ నర్సింహ్మా, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు తిరందాసు శ్రీను, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, కర్నాటి ధనుంజయ్య,పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, పందుల సత్యంగౌడ్, భూతరాజు శ్రీహరి, నరేందర్‌రెడ్డి, చెరుపలలి కృష్ణ, మల్లేశం, బోడ ఆంజనేయులు, కాసాల జనార్ధన్‌రెడ్డి, నకిరెకంటి లింగస్వామిగౌడ్, శివ, మనోహర్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సన్నాహక సమావేశానికి భారీగా హాజరు కావాలి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయుటకు నేడు యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మి నరసింహ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆలేరు నియోజకవర్గ స్థాయి సన్నాహాక సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యెల్లంల సంజీవరెడ్డి తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పార్టీలో వివిధ హోదాలో ఉన్న మహిళా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ హోదాలోని ప్రజాప్రతినిధులు, పార్టీలో వివిధ హోదాలో ఉన్న నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థలు, కాంగ్రెస్ పార్టీ, శ్రేణులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## కంఠమేశ్వరస్వామి గుడి నిర్మాణానికి విరాళం అందచేత

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో గౌడ కులదైవం సూరమాంబసమేత శ్రీ కంఠ మహేశ్వరస్వామి గుడి నిర్మాణానికి, పండుగకు ఆర్థిక సహాయంగా ఇన్నోవేటీవ్ ఆక్వా సిస్టం ప్రయివేటు లిమిటెడ్ అధినేత బబ్బూరి బాలరాజు గౌడ్ రూ.50 వేల విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం తరుపున ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కొండం నాగరాజు గౌడ్, కొండం నర్సింహులు గౌడ్, పాల జమ్మయ్య గౌడ్, బైరు ఆంజనేయులు గౌడ్, మార్క ఆంజనేయులు గౌడ్, పాల హరీష్ గౌడ్, ఎరుకల స్వామి గౌడ్, పాల బల్ శెట్టి గౌడ్, కొండం వెంకటేష్ గౌడ్, బాలరాజు గౌడ్,బాలయ్య గౌడ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్,వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్,బైరు వెంకటేష్ గౌడ్,అలువల మల్లికార్జున్ గౌడ్, బత్తిని భాస్కర్ గౌడ్,పాల నర్సిములు గౌడ్,సత్తయ్య గౌడ్,పాల చంద్రయ్య గౌడ్,రమేష్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్,పాల బాలరాజు గౌడ్,కొండం శివ గౌడ్,కొండం మణికంఠ గౌడ్ తదితరులు.

## నేడు విశ్వేశ్వర స్వామి దేవాలయములో విగ్రహాల ప్రతిష్టాపన

**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి :** భూధాన్ పోచంపల్లి మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించబడిన శ్రీ సీతారామచంద్ర సహిత శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయంలో నేడు విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం జరగనుందని ఆలయ నిర్వాహకుల కమిటీ శుక్రవారం తెలిపారు. నూతనంగా దాతల సహాయంతో నిర్మించిన శివాలయము, రామాలయము, గర్భాలయములు మహామండపము, విమాన గోపురములు, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలలో మూడు రోజుల నుంచి దేవిక కైంకర్యాలను నిర్వహిస్తున్నారు. సుందరశిల్ప సుశోభిత మైన మందిరాలలో వేద పండితులు నిర్ణయించిన ముహూర్తానికి శాస్త్రోక్తంగా క్రతువును నిర్వహిస్తారని తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపన అనంతరం ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక హోమాది పూజలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామస్తులు, భక్తులు, బంధువులు, దాతలు, పరిసర గ్రామాల భక్తులు ప్రతి ఎత్తున పాల్గొని మహా జాతర జరుపనున్నారు. డిసిసి ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సామ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సర్వి రవీందర్ గౌడ్,పడమటి బుచ్చిరెడ్డి, కాసుల చిన్న సత్తయ్య ,సుర్వి యాదయ్య, శ్రీనివాస్ గౌడ్, కళ్లెం అచ్చిరెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా కో కన్వీనర్‌గా గోపి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్‌గా మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామానికి చెందిన నెల్లికంటి గోపి నియమించబడినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన భాజపా జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ, మండల అధ్యక్షుడు బొడిగె సాంభశివగౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాజాపా 400 ఎంపి సీట్లు గెలిచి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని ధీమా వ్యక్తం చేశారు